మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక
6.4.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 346 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## చెన్నైకి హ్యాట్రిక్ పరాభవం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు
# న్యాయ వ్యవస్థలు!

- సాధారణ పౌరుడికి కోర్టు అనేది చివరి ఆశ, ఆశ్రయం
- ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారితం
- తెలంగాణ హైకోర్టుకు పునాది రాయి వేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- తెలంగాణ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఇది మరో మైలురాయి
- హైకోర్టు జోన్-2 నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా పునాది రాయి



**జనతా న్యూస్, హైదరాబాద్ :** భారత దేశ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబం కోర్టులని... దేవాలయం, మసీదు, చర్చి లేదా గురుద్వారా నిర్మించడం ఎంత గొప్ప విషయమో, ఒక కోర్టు సముదాయాన్ని నిర్మించడం అంతకంటే గొప్ప విషయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అభివర్ణించారు. న్యాయం కోసం ప్రాంగణాన్ని సృష్టించడం అంటే అన్ని మతాల ప్రజల కోసం ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించినట్లేనని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అగ్రశ్రేణి న్యాయ మేధావుల సమక్షంలో ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం తన జీవితంలో లభించిన అత్యంత అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్లో నిర్మించనున్న హైకోర్టు

మిగతా 2 లో

## డ్రగ్స్ నుంచి యువతను కాపాడేది క్రీడలే!

ఆలిండియా పోలీస్ ఫుట్బాల్ చాంపియన్షిప్లో సీఎం

# శివాలెత్తిన డొనాల్డ్ ట్రంప్

### బ్యాలెన్స్ కోల్పోయిన అమెరికా అధ్యక్షుడు..

- ట్రంప్.. బూతుల దాడి
- ట్రూత్ సోషల్ వేదికగా ఇరాన్పై కారుకూతలు
- అల్లాకు సర్వస్తోత్రాలంటూ వ్యంగ్యాస్త్రాలు
- హార్ముజ్ తెరవాలంటూ తిట్ల దండకం
- నరకానికి పోతారంటూ శాపనార్థాలు
- మంగళవారం మీకు మూడిందంటూ హెచ్చరికలు
- విద్యుత్ ప్లాంట్లు, వంతెనలు ధ్వంసం చేస్తానని వార్నింగ్



04

ఇరాన్తో ఘర్షణల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహనం కోల్పోయారు. భీకర దాడులు చేసినా, అల్టిమేటమ్లు, వార్నింగ్లు ఇచ్చినా శత్రుదేశం దారికి రాకపోవడంతో ఆయన చిర్రెత్తిపోతున్నారు. పైగా తమ యుద్ధ విమానా లను, శక్తివంతమైన ఫైటర్లను కూల్చేస్తుండటం ట్రంప్ ఆహాన్ని దెబ్బతీసింది.

# దీదీ పాలన మహా జంగిల్రాజ్

- ఎన్నికల తర్వాత బెంగాల్ నుండి భయం పారిపోతుంది.
- తృణమూల్ కాంగ్రెస్ పతనం ఖాయమైంది.
- ఈ నెలలోనే మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం
- కూచిబిహార్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ



04




# బీజేపీ ఖాతాలో ఖానాపూర్

- బీజేపీ, బీఆర్ఎస్ కూటమికే దక్కిన మున్సిపల్ పీఠం
- చైర్పర్సన్ బీజేపీ కౌన్సిలర్ అంకం మౌనిక
- వైస్ చైర్మన్ బీఆర్ఎస్ కౌన్సిలర్ మహ్మద్ షోహెబ్
- కాంగ్రెస్కు చేజారిన చివరి అవకాశం
- 50 రోజుల ఉత్కంఠకు తెర



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరవీడింది. బీజేపీ, బీఆర్ఎస్ కూటమి మున్సిపల్ పగ్గాలు కైవసం చేసుకుంది. శనివారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా గందరగోళం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఆదివారానికి ఎన్నిక వాయిదా వేశారు. ఆదివారం మధ్యాహ్నం 12.30కు ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చేతులెత్తే విధానం ద్వారా చైర్పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

వివరాలు 3 లో



## బీజేపీ బలమైన భారత్ నిర్మాణానికి పునాది

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కిషన్ రెడ్డి
- బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని..
- పలు చోట్ల పార్టీ జెండా ఆవిష్కరణలు

.. వివరాలు 3లో

## మేం ముస్లింలకు వ్యతిరేకం కాదు

- చొరబాటుదారులను మాత్రమే బీజేపీ వ్యతిరేకిస్తోంది
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పునరుద్ఘాటన
- అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలుపు ధీమా

# రూ. 7 వేల కోట్ల భూములు హాంఫట్!

### నాదర్గుల్లో భారీ భూదందా!

- గద్దల్లా తన్నుకు పోతున్న కాంగ్రెస్ పెద్దలు
- న్యాయస్థానాన్ని ధిక్కరించి మరీ భూ కబ్జా
- బౌన్సర్లతో బెదిరించి పేదల భూముల ఆక్రమణ
- మంత్రి పొంగులేటిదే ప్రధాన పాత్ర
- కనుమరుగవుతున్న లచ్చమ్మకుంట
- మాయమైన 100 ఎకరాల గుట్టలు
- హైడ్రా ఎందుకు జోక్యం చేసుకోవడంలేదు?
- ఆ భూముల్ని కాపాడకపోతే ప్రత్యక్ష పోరే
- మీడియా సమావేశంలో హరీష్ రావు

03





## కేసీఆర్ గత పాలన దేశానికి ఆదర్శం

### ఆ పాలనే ఐటీ దిగ్గజాలను ఆకట్టుకుంది

- నాడు సాధించిన ప్రగతి నేటికీ తోడ్పాటునిస్తోంది
- ప్రపంచానికి వ్యాక్సిన్ అందించే స్థాయికి రాష్ట్రం ఎదిగింది
- కొలంబియా యూనివర్సిటీలో తెలంగాణ అభివృద్ధిని వివరించిన కేటీఆర్

03




# ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్ల వంటిది

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం**

**హైదరాబాద్ :** జర్నలిజం ఒక మహావృక్షమైతే అందులో ఫొటో జర్నలిస్టులు ప్రాణం లాంటి వారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్ల వంటిదని, దీనిని అందరూ కాపాడుకోవాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎస్పీజేఏ) ఆధ్వర్యంలో జరిగిన 23వ ఉత్తమ ఫొటో జర్నలిస్ట్–2025 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భాషతో సంబంధం లేకుండా భావాన్ని వ్యక్తపరిచే శక్తి కేవలం ఫొటోగ్రఫీకే ఉందన్నారు. వంద మాటల పనిని ఒక్క ఫొటో పూర్తి చేస్తుందని, అక్షరాలు చెప్పలేని సత్యాన్ని ఫొటో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటో జర్నలిస్టులు ఏఐ వంటి నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అక్షర సత్యానికి ఫొటో జర్నలిజం ఊపిరి పోస్తుందని బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫొటో జర్నలిస్టులకు వెంకయ్యనాయుడు అవార్డులు అందజేశారు. ప్రథమ బహుమతి ఇందు శ్రీనివాస్ (ఈనాడు, నిజామాబాద్), ద్వితీయ బహుమతి ఎ.కృష్ణ (ది హన్స్ ఇండియా, హైదరాబాద్), తృతీయ బహుమతి జి.బాలస్వామి (సాక్షి, హైదరాబాద్) అందుకున్నారు. వీరితో పాటు మరో పది మంది ప్రతిభావంతులకు కూడా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నేతలు దేవులపల్లి అమర్, నరేందర్ రెడ్డి, అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి నరహరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మోడల్‌నే కేరళంలో అమలు చేస్తాం

**మార్పు కోసం ఓటు కాంగ్రెస్‌తోనే భవిష్యత్**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ :** కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మావేలిక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో యూడిఎఫ్ అభ్యర్థి ముతర రాజ్కు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. అదే విధంగా కేరళంలోకూడా యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీ లను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేరళంలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్డీఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ఎల్డీఎఫ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారని, పది సంవత్సరాల అసమర్థ పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్కు అధికారం అప్పగించాలని మంత్రి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళం లో స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు.ఇది సాధారణ ఎన్నిక కాదని కేరళం భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికని ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించి, యూడీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు న్యాయవ్యవస్థలు!

మొదటి పేజీ తరువాయి

జోన్–2 భవనానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "మన ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారితంగా, గౌరవంతో పనిచేస్తాయి. సాధారణ పౌరుడికి కోర్టు చివరి ఆశ, చివరి ఆశ్రయం. అందువల్ల, తెలంగాణ కోసం కొత్త హైకోర్టు నిర్మాణాన్ని ప్రారంభించడం నా ప్రభుత్వానికి ఒక గొప్ప అవకాశం. జీవితంలో ఒకసారి వచ్చే అవకాశం" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. "గతంలో అనేక ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును చేపట్టవచ్చు. కానీ కొన్ని కారణాల వల్ల అది మా ప్రభుత్వానికి దక్కింది. ఈ కొత్తహైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా మారుతుంది. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వేదికగా ఉంటుంది. రా బోయే 100 సంవత్సరాల పాటు పేదలు, బలహీనులు, అణ గారినవారు ఈ న్యాయ మందిరానికి వచ్చి తను వేదనను వినిపిం చుకుంటారు. ఈ భవనం కేవలం నిర్మాణం కాదు.. ఇది మా ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం. అన్ని వ్యవస్థలు పరస్పర గౌరవంతో, సహకారంతో పనిచేయాలి అని మేము నమ్ముతున్నాం. ప్రజా ప్రభుత్వం న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవాన్ని ఇస్తుంది. న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహ క విభాగం బాధ్యతగా మేము భావిస్తున్నాం. ఇక్కడ నిర్మిత మవుతున్నది భారతదేశంలో అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కేవలం హైకోర్టు మాత్రమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా 49 కోర్టులు, నివాస సముదాయాల కోసం కొత్త ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2023 డిసెంబర్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయాల్లో హైకోర్టు నూతన భవన సముదాయం ఒకటి. ఈ ప్రాజెక్టు కోసం రాజేంద్రనగర్లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. సంస్థ భవనాల కోసం జోన్–1లో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోజు జోన్–2లో నివాస భవనాలకు శంకు స్థాపన చేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని



లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 49 కోర్టుల కోసం, అనేక నివాస సము దాయాల కోసం కొత్త ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. అన్ని వ్యవస్థలు పర స్పర గౌరవంతో కలిసి పనిచేయాలి. " అని సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు.

**న్యాయవ్యవస్థ బలోపేతానికి దోహదం**

**సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సూర్యకాంత్**

దేశంలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి చర్యలు కొనసాగుతు న్నాయని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ప్రతినిత్యం బాధితుల పక్షాన నిలిచి వారికి న్యాయం అందే వరకూ శ్రమించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. తెలంగాణలో పెరుగుతున్న జనాభాకు, న్యాయ వ్యవస్థ అవ సరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయస్థానాలకు అవసరమైన భవనాలు, సాంకేతిక వనరులు అందుబాటులోకి రావడం ద్వారా సాధారణ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందని చెప్పారు. కొత్త హైకోర్టు ప్రాంగణం కోసం విలువైన భూమిని కేటాయించి, నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న తెలంగాణ హైకోర్టు ప్రాంగణం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని ఆకాంక్షించారు. ఇదే ప్రాంగణంలో ఉండే న్యాయమూర్తులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. బాధితులకు మరింత సత్వర న్యాయం అందించేలా న్యాయమూర్తులు, న్యాయాధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పిలుపునిచ్చారు.

**సువిశాల స్థలంలో... ఆధునిక సదుపాయాలతో...**

సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ కొత్త ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో కోర్టు గదులు, డిజిటల్ లైబ్రరీలు, పరిపాలనా విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు రెండో దశలో న్యాయమూర్తుల నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం వారసత్వ కట్టడం కావడంతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బుద్వేల్లో ఈ ఆధునిక కాంప్లెక్సు ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమవుతున్న ఈ జోన్–2 భవనం ద్వారా న్యాయ సేవలు మరింత వేగవంతం అవుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివదర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నుంచి యువతను కాపాడేది క్రీడలే!

**ఆలిండియా పోలీస్ ఫుట్బాల్ చాంపియన్షిప్ కార్యక్రమంలో సీఎం**

**హైదరాబాద్:** యువత డ్రగ్స్ బారిన పడకుండా అధికార యంత్రాంగమంతా బాధ్యతాయుతంగా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వశాఖల్లోనూ క్రీడలకు భాగస్వామ్యం పెరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ దిశగా పోలీసులు సైతం ప్రాధాన్యమివ్వాలని, యువతలో అవగాహన కల్పిస్తూ.. ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. భారత ఫుట్ బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి ఉన్న అద్భుతమైన వైభవాన్ని పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన క్రీడా వేడుకల్లో ఆయన ప్రసంగిస్తూ, 1950 నుంచి 60వ దశకం వరకు హైదరాబాద్ను 'నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్ బాల్'గా పిలిచేవారని గుర్తు చేశారు. దేశంలోనే ఫుట్ బాల్ ఆటను ఆదరించి, అత్యుత్తమ క్రీడాకారులను అందించిన ఘనత ఈ నగరానిదని, 1956 ఒలింపిక్స్లో ఆడిన భారత ఫుట్ బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్కు చెందిన వారే ఉండటం మనందరికీ గర్వకారణమని కొనియాడారు. ప్రస్తుత టోర్నమెంట్లో దేశం నలుమూలల నుండి వచ్చిన 34 జట్లు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులందరినీ అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత నెమ్మదిగా క్రీడలకు దూరం అవుతున్నారని, మైదానాలను వదిలిపెట్టి వారు తప్పుడు మార్గంలో వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను సౌత్ కొరియాలో పర్యటించినప్పుడు అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించానని, కేవలం 30 ఎకరాల్లో ఉన్న ఆ యూనివర్సిటీ ఎన్నో పతకాలను సాధించిందని తెలిపారు. 4 కోట్ల జనాభా ఉన్న సౌత్ కొరియా 30కి పైగా పతకాలు సాధిస్తే, అందులో ఒక చిన్నమ్మాయి రెండు బంగారు పతకాలు గెలుచుకుందని, కానీ140కోట్ల జనాభా ఉన్న మన దేశం క్రీడల్లో ఆశించిన స్థాయిలో



రాణించలేకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ అంతరాన్ని పూరించడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. పబ్ కల్చర్, డ్రగ్స్ బారిన పడుతున్న యువతను తిరిగి మైదానాల్లోకి రప్పించడమే తన ప్రధాన ఉద్దేశమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ముఖ్యంగా బాగా చదువుకున్న యువతే డ్రగ్స్ బారిన పడుతుండటం కలవరపెడుతోందని, గతంలో దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో వీరులను అందించిన పంజాబ్ నేడు డ్రగ్స్ సమస్యతో సతమతమవుతోందని, మన ప్రాంతాన్ని మరో పంజాబ్ మారనివ్వబోమని గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఆదివాసీ పిల్లలకు మెస్సీతో కలిసి ఆడే అరుదైన అవకాశం కల్పించామని గుర్తు చేశారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ముఖ్యంగా ఫుట్బాల్ క్రీడాకారుడు కావడంతో క్రీడాకారులతో కలిసి ఆయన ఫుట్బాల్ ఆడారన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఫుట్బాల్ క్రీడకు అధిక ప్రాధాన్యం ఉండేదన్నారు. ఒలంపిక్స్లో ప్రతిభ చూపిన తెలంగాణ ఫుట్బాల్ క్రీడాకారులలో పోలీస్ శాఖకు చెందిన వారు సగానికి పైగా ఉండేవారన్నారు. గతంలో ఫుట్బాల్ క్రీడలో రాణించి అర్జున, ద్రోణాచార్య అవార్డులు అందుకున్న 82 సంవత్సరాల సయ్యద్ నయీముద్దీన్ ఈ వేదికపై పాలుపంచుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 34 పురుషుల జట్లు 9 మహిళల జట్లు పాల్గొన్న ఈ ఛాంపియన్షిప్ లో సీఐఎస్ఎఫ్ జట్టు ఫైనల్లో గెలిచి బంగారు పతకం సాధించిందని రన్నర్ అప్ టీంగా గోవా పోలీస్ జట్టు నిలిచిందని, మూడో స్థానంలో కేరళ జట్టు ఉందన్నారు. మహిళల విభాగంలో అస్సాం రైఫిల్స్ మొదటి ఒడిశా జట్టు రెండవ స్థానాన్ని సీఐఎస్ఎఫ్ మూడో స్థానాన్ని పొందిందన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ సప్నా తివారి మాట్లాడుతూ... ఫుట్బాల్ క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు మ్యాచ్ ఆడారు. అనంతరం జరిగిన మార్చ్ పాస్ట్ లో వివిధ రాష్ట్రాల జట్ల నుండి ముఖ్యమంత్రి గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా విజేతలకు ముఖ్యమంత్రి ట్రోఫీలను అందజేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఆర్బివిఆర్ఆర్, టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఇంటె లిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, అడిషనల్ డిజిపి లు అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, స్పోర్ట్స్ ఐజిపి గజరావు భూపాల్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో గచ్చిబౌలి స్టేడియం

**జూన్ 2న అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఒలింపిక్ క్రీడలకు అవసరమైన సౌకర్యాల కల్పన**

**స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ :** అంతర్జాతీయ క్రీడా ప్రమా ణాలతో గచ్చి బౌలి స్టేడియం తీర్చి దిద్దనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఒలింపిక్ క్రీడలను హైదరాబాద్ లో నిర్వహించేందుకు అవసర మైన మౌలిక సదుపాయాల కల్ప న పై ప్రభుత్వం దృష్టి సారిం చిందని సీఎం తెలిపారు. ఆది వారం లీలా హోటల్ లో జరిగిన స్పోర్ట్స్ హబ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ క్రీడలకు హైదరాబాద్ను వేదికగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గచ్చిబౌలి స్టేడియాన్ని తీర్చిదిద్దడమే నాలక్ష్యం అని అన్నారు. క్రీడల్లో హైదరాబాద్ దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దనున్నట్లు తెలిపారు. జూన్ 2న గచ్చిబౌ లి స్టేడియం అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపన చేయనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రారంభోత్సవానికి ముందు లోగోతో పాటు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి స్టేడియం లో హెలిప్యాడ్తో సహా అన్ని ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విమానాశ్రయం నుంచి క్రీడాకారులు నేరుగా గచ్చిబౌలి స్టేడియం



చేరుకునే విధంగా హెలిప్యాడ్ తో పాటు అన్ని ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి స్టేడియానికి భవిష్యతిలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సేటోడియం అభివృద్ధి డిజైన్లకోసం ఇప్పటికే ఆర్కి టెక్చర్ను నియమించినట్లు వెల్లడించారు. స్టేడియం అభివృద్ధి పైన బోర్డుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంలో తెలంగాణ లో క్రీడల అభివృద్ధిలక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒలింపిక్స్ క్రీడలను హైదరాబాద్లో నిర్వహిచేందుకు అవసరమైన సదుపా యాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం కావాలని అన్నారు. –చైనాలోని క్రీడా సౌకర్యాలను మించిన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. లక్షల సంఖ్యలో ఉన్న ఐటీ,ఇతర ఉద్యోగులను ఆకట్టుకునేందుకు బిగ్ స్క్రీన్స్ లాంటివి ఏర్పాటుచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈస మావేశంలో స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు కొణిదెల ఉపాసన, కావ్యమారన్, సంజీవ్ గోయెంకా, శశిధర్, జయేష్ రంజన్, స్పోర్ట్స్ స్పోర్ట్స్ ఎండి సోనీ బాలా దేవి పాల్గొన్నారు.

# బీజేపీ ఖాతాలో ఖానాపూర్

**బీజేపీ, బీఆర్ఎస్ కూటమికే దక్కిన మున్సిపల్ పీఠం**

**చైర్పర్సన్ బీజేపీ కౌన్సిలర్ అంకం మౌనిక**

**వైస్ చైర్మన్ బీఆర్ఎస్ కౌన్సిలర్ షోహెబ్**

**కాంగ్రెస్‌కు చేజారిన చివరి అవకాశం**

**50 రోజుల ఉత్కంఠకు తెర**



**ఆదిలాబాద్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరవీడింది. బీజేపీ, బీఆర్ఎస్ కూటమి మున్సిపల్, పగ్గాలు కైవసం చేసుకుంది. శనివారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా గందరగోళం, ఉద్రిక పరిస్థితులు నెలకొనగా ఆదివారానికి ఎన్నిక వాయిదా వేశారు. ఆదివారం మధ్యాహ్నం 12.30కు ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చేతులెత్తే విధానం ద్వారా చైర్పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చైర్పర్సన్ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ అంకం మౌనిక పేరును బీజేపీ ప్రతిపాదించగా, బీఆర్ఎస్ తమ పార్టీ నుండి వైస్ చైర్మన్ పదవికి షోహెబ్ పేరును తెరపైకి తెచ్చింది. ఈ మున్సిపాలిటీలో బీజేపీకి 4, బీఆర్ఎస్కు 4, కాంగ్రెస్కు 3, ఇండిపెండెంట్ఒకరు విజయం సాధించగా, ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ అభ్యర్థి కాంగ్రెస్లో చేరారు. ఖానాపూర్ ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఉత్కంఠ పరిణామాల మధ్య ఎన్నిక నిర్వహించగా, బీజేపీ బలపర్చిన అభ్యర్థి అంకం మౌనికకు ఏడు ఓట్ల మ్యాజిక్ ఫిగర్ రావడంతో చైర్పర్సన్గా గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. బీజేపీ మద్దతుతో బీఆర్ఎస్ అభ్యర్థి షోహెబ్ వైస్ చైర్మన్ గా ఏడు ఓట్ల మద్దతుతో విజయం సాధించారు. శనివారం ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అరా చకాలకు పాల్పడిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున ఖానాపూర్ తరలివెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీ సులు ముందు జాగ్రత్తగా ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను మం చిర్యాలలో, మాజీ మంత్రి జోగురామన్నను ఆదిలాబాద్లో హౌస్ అరెస్టు చేశారు. బీజేపీ కూటమికే మ్యాజిక్ ఫిగర్ మూడు పార్టీలకు సమానమైన ఓట్లు ఉండటంతో ఏ పార్టీకి మెజార్టీ దక్కకపోవడం ఉద్రిక్త పరిస్థితులకు తావిచ్చింది. 50 రోజులుగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లను క్యాంపులకు తరలించి, అభ్యర్థులు చేజారనివ్వకుండా ప్రయత్నాలు సాగిం చారు. బీఆర్ఎస్ నుంచి ఒక కౌన్సిలర్ కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆ పార్టీకి మూడు సీట్లు మాత్రమే మిగిలాయి. దీంతో బీజేపీ చైర్మన్ పదవిని పట్టు బట్టగా, బీఆర్ఎస్ వైస్ చైర్మన్ పదవిని సాధించేలా ఒప్పందం కుదుర్చు కున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బీఆర్ఎస్ అసెంబ్లీ ఇన్చార్జి జాన్సన్ నాయక్ తమ అభ్యర్థులు కాంగ్రెస్ గూటికి మొగ్గుచూపకుండా ఇంతకాలం చేసిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. బీజేపీ, బీఆర్ఎస్ కూటమి విజయం సాధించడంతో విజయోత్సవ సంబరాలు ఖానాపూర్లో మిన్నంటాయి. కాగా ఈ పరిణామాలు అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుకు షాక్ తినిపించాయి.

### అనైతిక పొత్తులు విడ్డూరం : ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

బీజేపీ, బీఆర్ఎస్ ముందునుండి లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని, వారిమధ్య అనైతిక పొత్తు ప్రజల ముందు బయటపడిందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. ఆ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అనైతిక పొత్తు సహించలేక కాంగ్రెస్ వైపు మొగ్గుచూపినప్పటికీ వారిని నిర్బంధించి, ఆ పార్టీ నేతలు బయటకు రానివ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి నైతిక విజయం సాధించిందని . ఆ రెండు పార్టీల అక్రమ సంబంధాలు ప్రజల ముందు తేటతెల్లం అయ్యాయని అన్నారు.

# రూ. 7 వేల కోట్ల భూములు హాంఫట్!

## నాదర్ గుల్‌లో భారీ భూదందా!

### మీడియా సమావేశంలో భారాస నేత హరీష్ రావు



**హైదరాబాద్ :** నాదరుల్లో భారీ భూకుం భకోణం జరుగుతోందనీ, బౌన్సర్లతో దాడులుచేయించి పేదరైతుల భూములను పాలకులు ఆక్రమించేస్తున్నా... హైడ్రా చోద్యం చూస్తోందని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. తక్షణం స్పందించి ఆ భూ కబ్జాలను నివారించని పక్షంలో శాసనసభ్యులతో కలిసి ప్రత్యక్ష చర్యలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. చట్టాలను కాల రాస్తూ, న్యాయస్థానం తీర్పులకు విలువివ్వకుండా అక్కడి 373 ఎకరాల ప్రభుత్వ భూమిని పాలకుల మద్దతుతో దురా క్రమణ జరగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును బేఖాతర్ చేస్తూ సుమారు రూ. 7వేల కోట్ల విలువైన భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భారీ కుంభకోణంలో సాక్షాత్తు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి కుటుంబం ఉందని హరీష్ రావు చెప్పారు. సీఎం. రేవంత్ రెడ్డి ప్రమే యం కూడా ఉందని ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్ లో నాదర్ గుల్లో భూములు కోల్పోయిన రైతులతో హరీష్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కౌసల్య, మమత తదితర రైతులు ఆయనవద్ద తమగోడు వినిపించుకున్నారు. బౌన్సర్లు దాడి చేస్తూ తమ భూముల చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని బోరున విలపించారు. అనంతరం మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ బాధిత మహిళలతో కలిసి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. పేదల ఇళ్లు కూలగొట్టే హైడ్రాకు అధికార పార్టీ నేతల వేల కోట్ల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాదారులను అరెస్ట్ చేసి, రైతులను భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. నాదరుల్ భూములపై సోమవారం ఉదయంలోగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్యలు తీసుకోకపోతే.. ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ప్రత్యక్ష చర్యలకు దిగుతామని హెచ్చరించారు. రక్షకులే భక్షకులుగా వ్యవహరిస్తూ నాదర్ గుల్ లోని సర్వే నంబర్ 613 (కొత్త సర్వే నంబరు 113) లోని 373 ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. దొంగ సర్టిఫికెట్లతో భూముల విక్రయం రాష్ట్రంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలు ఉండకూడదనీ, కానీ నిజాం నుంచి ఈ భూములు వచ్చాయని దొంగ సర్టిఫికెట్లు సృష్టించి 2016లో శివరాజ్ బహదూర్ ఈ భూములను ఆల్ఫా, ఒమేగా, యుని టెక్ అనే కంపెనీలకు విక్రయించినట్లు వివరించారు. చట్టంలోని సెక్షన్ 8, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఈ భూములను అమ్మే హక్కు ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. ఈ విక్రయాలు చెల్లవని, ఇది సెక్షన్ 22 కింద నిషేధిత జాబితాలో ఉ ంటుందని కందుకూరు ఆర్డీఓ తేల్చిచెప్పారని గుర్తుచేశారు. ఆర్డీఓ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆ కంపెనీలు హైకోర్టుకు వెళ్లగా ఆర్డీఓ నిర్ణయమే సరైనదని, ఈ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్(13-10-2022)స్పష్టం చేసిందనీ, అంతేగాకుండా అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించిందని తెలిపారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారని తెలిపారు. ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం దగ్గర కేసు పెండింగ్లో ఉందని వివరించారు. బాధిత రైతులు మార్చి 9, 10 తేదీల్లో ప్రస్తుతకందుకూరు ఆర్డీఓకు ఎమ్మార్వోకు, రంగారెడ్డి కలెక్టర్కు, హైడ్రాకు ఆక్రమణలపై వినతిపత్రాలు సమర్పించినా స్పందనలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ కంపెనీల కబ్జాల వెనుకసాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని హరీష్ రావు ఆరోపించారు.

# అవినీతిపై విచారణకు సిద్ధమా?

## నియామకాలపై కాదు.. ఒప్పందాల్లో అక్రమాలపై ఎంక్వైరీ చేయండి

### అల్ట్ మిన్, సోలార్ డీల్స్పై శ్వేతపత్రం విడుదల చేయాలి

### కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే మరో ఉద్యమం

### తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కవిత డిమాండ్

### సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశంలో ఐదు కీలక తీర్మానాలు



**హైదరాబాద్ :** సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందని, కార్మికుల నియామకాలపై విచారణ జరుపుతామని చెబుతున్న పాలకులు.. తమ ప్రభు త్వంలో జరుగుతున్న అడ్డగోలు అవినీతిపై విచారణకు సిద్ధ మా? అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. ఆదివారం బంజారాహిల్స్లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సేవ్ సింగరేణి పేరుతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా సింగరేణిలో జరుగుతున్న ఆర్థిక అక్రమాలు, ప్రభుత్వ వైఖరిపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో డిపెం డెంట్ కార్మికుల నియామకాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేస్తామని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో చేసిన ప్రక టనపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాన వతా దృక్పథంతో 20 వేల మంది కార్మికులకు ఉద్యోగాలిస్తే, దానిపై విచారణ జరపడం ఏంటని ప్రశ్నించారు. నైనీ కోల్ బ్లాక్ అవినీతిని తాము బయటపెట్టినందుకే భట్టి విక్రమార్క కార్మి కులపై కక్షపెంచుకున్నారని, వారిని భయపెట్టేందుకే విచారణ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల జోలికొస్తే ఊరుకోమని కవిత హెచ్చరించారు.

### వేల కోట్ల కుంభకోణం.. శ్వేతపత్రం ఏది?

రాజస్థాన్ ప్రభుత్వంతో చేసుకున్న సోలార్ ఒప్పందంలో ఒక మెగావాట్ విద్యుత్కు అయ్యే ఖర్చు కంటే మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చూపిస్తున్నారని కవిత ఆరోపించారు. అలాగే, లిథియం రిఫైనరీ పేరుతో అల్ట్ మిన్ అనే చిన్న సంస్థతో రూ. 2250 కోట్ల ఒప్పందం చేసుకోవడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని దుయ్యబట్టారు. కేవలం రూ.27 లక్షల ఆదాయం కూ డా లేని కంపెనీకి వేల కోట్ల ప్రాజెక్ట్ ఎలా కట్టబెట్టారని, దీనివెనుక ఉన్న బడా బాబుల పేర్లను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందాలన్నింటిపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయా లని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేతగానితనం వల్ల సింగరేణికి నష్టాలు వస్తున్నాయని, ప్రభుత్వం సంస్థకు దాదాపు రూ. 47 వేల కోట్లు బకాయి ఉందన్నారు. ఆ బకాయిలు చెల్లించ కుండా సంస్థ నిర్వహణ భారమంటూ కార్మికులపై నెపం నెట్టడం సరికాదన్నారు. డీజిల్ కుంభకోణం, లీకేజీలు, ఇతర ఉల్లంఘనల వల్ల సుమారు రూ. 1400 కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ నివేదికే స్పష్టం చేసిందని పేర్కొన్నారు. సింగరేణి తెలంగాణకు ప్రాణప్రదాయని అని, సంస్థను కాపాడుకునేం దుకు అవసరమైతే మరో గ్రారీ ఉద్యమానికి సిద్ధమన్నారు. మ రో 20 రోజుల్లో తమ కార్యాచరణ ఉంటుందని, అప్పటిలోగా ప్రభుత్వం స్పందించకపోతే బొగ్గు బాయి బాట పడతామని హెచ్చరించారు. సింగరేణి కార్మికులకు ఇన్ కమ్ ట్యాక్స్ మిన హాయింపు ఇవ్వాలని కూడాడిమాండ్ చేశారు. అంతకముందు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బంజారాహి ల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి కవిత నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

### సమావేశంలో ఐదు తీర్మానాలు

సింగరేణి పరిరక్షణ కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఐదు తీర్మానాలు చేసింది. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ (నల్ల చట్టాలను)లను రాష్ట్రంలో అమలు చేయబో మని అసెంబ్లీలో తీర్మానం చేయాలి. మానవతా దృక్పథంతో మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి, పెండింగ్ కేసులు పరిష్కరించాలి, అలియాస్ నేమ్స్ సమస్యను రాజకీయ చొరవ తో శాశ్వతంగా పరిష్కరించాలి. అల్ట్ మిన్ కంపెనీతో కుదు ర్చుకున్న రూ. 2250 కోట్ల ఒప్పందంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. నైనీ, తాడిచర్ల వంటి కొత్త బొగ్గు గనులను సింగరేణి సంస్థే నేరుగా ఆపరేట్ చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానా లకు ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధి ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ నేతలు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### వడగళ్ల వాన బాధితులను ఆదుకోవాలి: కవిత

వడగళ్ల వానతో నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజక వర్గ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, బాధిత రైతులను ప్రభు త్వం తక్షణమే ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు. సాలూ ర, ఖాజాపూర్, హున్సా, మందర్నా గ్రామాల్లో వరి, మొక్కజొ న్న, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆదివా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు ఏసీ గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు.

# కేసీఆర్ గత పాలన దేశానికి ఆదర్శం

### కొలంబియా యూనివర్సిటీలో తెలంగాణ అభివృద్ధిని వివరించిన కేటీఆర్




**హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వం అంటేనే ఆత్మగౌరవం, ఆకాం క్షలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఉద్ఘాటించారు. ఎన్నో చిరస్మరణీయమైన త్యాగాలకు చిరు నామాగా నిలిచి అభివృద్ధి లక్ష్యంగా దూసుకువెళ్లిన తెలంగాణలో ప్రతి అంశం ఆచరణీయమైందని చెప్పారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రపంచ ఐటీ దిగ్గజాలను ఆకర్షించడానికి కారణమైందని తెలిపారు. అమెరికాలోని కొలంబియా యూనివ ర్సిటీలో నిర్వహించిన ఇండియా బిజినెస్ కాన్ఫ రెన్స్- 2026లో ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ కొత్తరాష్ట్రంగా ఆవిర్భవించాక తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. ఆత్మగౌరవంతో ప్రజలు అభివృద్ధివైపు అడుగులు వేయడంతోనే అభివృద్ధి సాధ్యమైందని చెప్పారు. కేసీఆర్ నాయ "త్వంలో ప్రజలు పట్టుదలతో అభివృద్ధివైపు దూసుకుపోయారని చెప్పారు. ఆర్థిక వృద్ధిలో దేశానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచి అనేక అద్భుతాలను ఆవిష్కరించిందని చిందని కేటీఆర్ చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ అభివృద్ధికి అవకాశాల కోసం ఎదురుచూడలేదని తెలిపారు. అద్భుతమైన పాలసీలు తయారు చేశామని మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధి సాధించినట్లు వివరించారు. పదేళ్లలోనే తెలంగాణ సాధ్విం చిన ఆర్థిక ప్రగతి దేశానికి గర్వకారణమని కొనియాడారు. ఐటీ, పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుత విజయా లను సాధించిందని తెలిపారు. ఐటీ ఎగుమతులు రూ.2.72 లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. ఐటీ ఉద్యోగుల సంఖ్య దాదాపు 10 లక్షలకు చేరుకుందని చెప్పారు. తమ పాలనలో హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని కేటీఆర్ తెలిపారు. అమెజాన్ హైదరాబాద్లో అతిపెద్ద క్యాంపస్ ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

### వ్యాక్సిన్ రాజధానిగా తెలంగాణ

ప్రపంచానికే వ్యాక్సిన్ రాజధానిగా తెలంగాణ ఎదిగిందని కేటీఆర్ చెప్పారు. ప్రపంచ వ్యాక్సిన్లలో మూడో వంతు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఏటా 10 బిలియన్ డోసుల వ్యాక్సిన్లను తెలంగాణ ఉత్పత్తి చేస్తున్నదని తెలిపారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో 40 శాతం వాటా తెలంగాణదేనని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఏటా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోరాటాలు, యగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేవలం పదేళ్లలోనే దేశానికి మార్గదర్శకంగా నిలిచే స్థాయికి ఎదిగామని తెలిపారు. వ్యవసాయం, ఐటీ,, పరిశ్రమలు, సంక్షేమ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ఈ వేదికపై కేటీఆర్ వివరించారు.

# బీజేపీ బలమైన భారత్ నిర్మాణానికి పునాది

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కిషన్ రెడ్డి**

**బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని..**

**పలు చోట్ల పార్టీ జెండా ఆవిష్కరణలు**

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదనీ, దేశ భవిష్యత్తును మలిచే ఒక శక్తివంతమైన జాతీయ ఉద్య మంగా నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మం త్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశంలోని ఇరవై ఒక్క రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే కాకుండా, సిద్ధాంత బలం, కార్యకర్తల క్రమశిక్షణ, జాతీయ సేవ పట్ల అచంచల నిబద్ధతతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదగడం గర్వ "కారణంగా ఉ ందన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని (సోమ వారం) పురస్కరించుకుని ఒక రోజు ముందుగా ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లపై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తార్నాకలోని నివాసం వద్ద, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసం కాచిగూడలో ఇతర ముఖ్య నేతలు తమ ఇళ్ల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త దేశం ముందు - పార్టీ తరువాత స్వయం చివర అనే భావనతో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి రావడంతో పాటు రాబోయే కాలంలో కూడా మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించు కున్నట్టుగా స్పష్టంగా తెలుస్తోందన్నారు. వాజపేయి, మోదీ ప్రధానమంత్రులైన తర్వాతనే భారత్లో నిజమైన ఆర్థిక మార్పును. అభివృద్ధిలో కొత్త యుగాన్ని చూడ డం ప్రారంభించినట్టు చెప్పారు. వీరి నాయకత్వంలో దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, బలమైన భారత నిర్మాణానికి పునాది వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అవినీతినే పాలనగా మార్చుకుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో అందుకు విరుద్ధంగా ఒక్క అవినీతి మచ్చ కూడా లేకుండా ప్రజలకు అవినీతి రహిత పాలనను అందిస్తున్నట్టు తెలిపారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలను, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాల నుంచి బీజేపీ శ్రేణులు ప్రేరణ పొందాలన్నారు. తెలంగాణలో మరింత అంకితభావంతో పనిచేసి పార్టీని అధికారం దిశగా తీసుకెళ్లాలని ప్రతి కార్యకర్త సంకల్పించాలన్నారు. సోమ వారం ప్రతి జిల్లాలో, ప్రతి ఇంట్లో, ప్రతి బూత్లో ఆవిర్భావ దినోత్సవ కార్య క్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# మేం ముస్లింలకు వ్యతిరేకం కాదు

## చొరబాటుదారులను మాత్రమే బీజేపీ వ్యతిరేకిస్తోంది

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పునరుద్ఘాటన

## అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలుపు ధీమా



**న్యూఢిల్లీ:** బీజేపీ వ్యతిరేకిస్తున్నది చొరబాటుదార్లను మాత్రమేనని, ముస్లింలను కాదని కాషాయపార్టీ సీనియర్ నేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పున రుద్ఘాటించారు. అస్సాం, పశ్చిమ బెంగాల్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమపార్టీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. 'అస్సాం, పశ్చిమ బెంగాల్ రెండింటిలోనూ మేమే గెలుస్తామని నేను గట్టిగా నమ్ముతున్నాను. మతంతో సంబంధం లేకుండా అందరినీ కలుపుకొని వెళ్లడమే బీజేపీ విధానం. మేము చొర బాటుదారులను వ్యతిరేకిస్తాము కానీ ముస్లింలకు వ్యతిరేకం కాదు," అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో గడ్కరీ అన్నారు. భారీ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిపాలనపై దృష్టి సారించిన అంశాలు ప్రచార వ్యూహంలో ప్రధానంగా ఉంటాయని తెలిపారు. అస్సాంతోసహా ఈశాన్యమంతటా సుమారు రూ. 5 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలవుతున్నాయి. దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల విలువైన మౌలిక ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయి. రూ. 1.5 లక్షల నుంచి రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. దీనికి అదనంగా, మరో రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి అని తెలిపారు. బీజేపీ విధా నంలో సమ్మిళితత్వం ప్రధానమైనదని గడ్కరీ పునరుద్ఘాటించారు. అందరినీ కలుపుకొని పోవడమే బీజేపీ విధానమని స్పష్టంచేశారు. ఉమ్మడి వారసత్వం ఉన్న ప్రజలు ఆశ్రయం కోరితే భారతదేశం వారికి ఆశ్రయం కల్పించగలదని, కానీ అక్రమంగా ప్రవేశించిన వారిని అంగీకరిం చలేదని, అలా చేస్తే దేశం ఒక "ధర్మశాల"గా మారుతుందని హెచ్చరించారు. భిన్నత్వంలో ఏకత్వమే మా సారం. పౌరసత్వ (సవరణ) చట్టం కింద హిం సకు గురైన మైనారిటీల కోసం ఉన్న నిబంధనలతో సహా రాజ్యాంగంలోని హక్కులకు బీజేపీ మద్దతు ఇస్తుందని అన్నారు. బెంగాల్ గురించి ప్రస్తావిస్తూ, ఓటర్లలో మార్పు ఆకాంక్ష పెరుగుతోందని గడ్కరీ అన్నారు. బీజేపీ గణనీయమైన విజయాలు సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పోటీ తీవ్రంగా ఉందని అంగీకరిస్తూనే, పరిపాలన, అభివృద్ధిపై దృష్టిసారిస్తామన్నారు. సర్ ప్రక్రియను 'నిశ్శబ్ద, అదృశ్య రిగ్గింగ్ కుట్ర'గా మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, విధాన రూపకల్పనలో తమ పార్టీ జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుందని నొక్కిచెప్పారు.

# రాజ్యసభ సభ్యుడిగా 10న నితీష్ ప్రమాణస్వీకారం



**న్యూఢిల్లీ :** బీహార్ ముఖ్యమంత్రి, జనతా దళ్ (యునైటెడ్) అధినేత నితీష్ కుమార్ ఏప్రిల్ 10న రాజ్య సభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని బీహార్ బీజేపీ నాయకుడు సంజయ్ సారావోగి ఆదివారం తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం, బీజేపీ కేంద్ర నాయకత్వం, ఎన్డీయే మిత్రపక్షాలు మంత్రివర్గ ఏర్పాటుపై చర్చలు జరుపు తాయన్నారు. బీహార్లో రాజకీయ కార్యకలాపాలు ఉధృతంగా సాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. గత నెలలో రాజ్యసభకు ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, నితీష్ కుమార్ ఇటీవల బీహార్ శాసన మండలి సభ్యుని (ఎమ్మెల్సీ) పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

# లోయలో పడిన టెంపో

## నలుగురు మృతి.. 14మందికి గాయాలు

**సిమ్లా:** పర్యాటకులు ప్రయాణిస్తున్న టెంపో ప్రమాదవ శాత్తు లోయలో పడిపోయిం ది. ఈ దుర్ఘటనలో ఇద్ద రు మహిళలతో సహానలుగురు మరణిం చారు. మరో 14 మంది పర్యాటకులు గాయప డ్డారు. వారిని ఆసుపత్రికి తరలిం చి చికిత్స అందిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ లోని కుల్లు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి ఇద్దరు పిల్లలతో -- సహా 22 మంది టూరిస్టులు టెంపోలో ప్రయాణించారు. జలోరి పాస్ నుంచి తిరిగి వస్తున్న ఆవాహనం భూంతర్ వైపు దిగుతుండగా వర్షాల కారణంగా రోడ్డుపై నుంచి లోయలోకి జారిపోయింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి వేళ స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఇద్దరు మహిళలతో సహానలుగురు పర్యాటకులు అక్కడికక్కడే మరణించినట్లు గుర్తించారు. 18 మంది పర్యాటకులను రక్షించి లోయ నుంచి పైకి తీసుకువచ్చారు. వారిలో 14 మంది గాయపటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థతితి విషమంగా ఉన్నదని పోలీస్ అధికారి తెలిపారు.



# శివాలెత్తిన డొనాల్డ్ ట్రంప్

## బ్యాలెన్స్ కోల్పోయిన అమెరికా అధ్యక్షుడు..

ట్రంప్.. బూతుల దాడి

ట్రూత్ సోషల్ వేదికగా ఇరాన్‌పై కారుకూతలు

అల్లాకు సర్వస్తోత్రాలంటూ వ్యంగ్యాస్త్రాలు

హోర్ముజ్ తెరవాలంటూ తిట్ల దండకం

నరకానికి పోతారంటూ శాపనార్థాలు

మంగళవారం మీకు మూడిందంటూ హెచ్చరికలు

విద్యుత్ ప్లాంట్లు, వంతెనలు ధ్వంసం చేస్తానని వార్నింగ్



వాషింగ్టన్: ఇరాన్‌తో ఘర్షణల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహనం కోల్పోయారు. భీకర దాడులు చేసినా, అల్టిమేటమ్లు, వార్నింగ్లు ఇచ్చినా శత్రుదేశం దారికి రాకపో వడంతో ఆయన చిర్రెత్తిపోతున్నారు. పైగా తమ యుద్ధ విమానా లను, శక్తివంతమైన ఫైటర్లను కూల్చేస్తుండటం ట్రంప్ ఆహాన్ని దెబ్బతీసింది. ఓవైపు యుద్ధం ముగింపునకు మార్గం కనిపించక పోవడం, మరోవైపు దేశీయంగా పెరుగుతున్న వ్యతిరేకత, ఆర్థిక, రాజకీయ సవాళ్లతో లోలోన మండిపోతున్నారు. ఇంకొకవైపు అంతర్జాతీయంగా అమెరికాతో పాటు తన వ్యక్తిగత పరపతి, ఇమేజీ రోజురోజుకు డ్యామేజీ అవుతుండటం ట్రంప్ను చికాకుకు గురిచేస్తోంది. రెండు రోజుల్లో ఇరాన్ అంతు చూస్తానని యుద్ధం ప్రారంభ రోజుల్లో బీరాలు పలికిన తనకు, ఇరాన్ కొరకురాని కొయ్యగా మారింది. పాలకుల్ని హతమార్చినా, ఆర్మీ టాప్ కమాం దర్లను, అధిపతులను అంతమొందించినా టెహ్రాన్ వెనక్కి తగ్గకపోవడం అమెరికా అధ్య క్షుడిని తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోం ది. లక్ష్యాలు సాధించామంటూ పదే పదే ప్రకటనలు చేసిన ట్రంపకు అదే నోట ఇరాన్కు హెచ్చరికలు, డెడ్లైన్లు విధించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇరాన్ తన హెచ్చరికలను ఖాతరు చేయకపోవడంతో సహనం కోల్పోయిన ఆయన, ఇక ఏకంగా తిట్ల దండకం అందుకున్నారు. సంస్కారహీనంగా వ్యవహరిస్తూ బూతుల దాడికి దిగారు. నోటితో ఉచ్చరించలేని విధంగా ల.. కారాలతో ఇరాన్ను దూషించారు. ఇంకా అంతకు మించిన బూతు బాంబులు పేల్చారు. 48 గంటల్లో ప్రళయం చూపిస్తానని శనివారం టెహ్రాను బెదిరించిన ఆయన, ఆదివారం మరింత శివాలెత్తారు. ఇరాన్లో తప్పించుకున్న తమ వాయుసేన సిబ్బందిని కాపాడి, సురక్షితంగా తరలించామని అంతకు ముందు పేర్కొన్న ఆయన. దానిని ఒక అద్భుతంగా అభివర్ణించారు. అయితే కొన్ని గంటల తరువాత తన ట్రూత్ సోషల్ మీడియాలో ఇరాన్పై తిట్లతో విరుచుకుపడ్డారు. తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్లో ఇరాన్పై విరుచుకుపడ్డారు. పరుష పదజాలంతో దూషణలకు దిగారు. ఈమేరకు వరుస పోస్టులు పెట్టారు. మంగళవారం ఇరాన్లో పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జ్ డే. రెండూ ఒకే రోజు జరగనున్నాయి. అలాంటిది మరెక్కడా జరగదు!! ఆ జలసంధిని తెరవండి రా పిచ్చి వెధవల్లారా (బాసర్ట్స్), లేకపోతే నరకానికి వెళ్తారు.. చూస్తూ ఉండండి! చివరిసారిగా అల్లాను ప్రార్థించుకోం డి.. సర్వస్తోత్రాలు చెప్పుకోండి అంటూ అత్యంత తీవ్ర పదజాలం తో రాశారు. ఈ నెల 7వ తేదీన ఇరాన్లో విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను కూల్చివేస్తామని ఈ విధంగా హెచ్చరించారు.

# ఇవాళ ఒప్పందం కుదరొచ్చు

## అలేకుంటే అన్నింటిని పేల్చివేసి, చమురు స్వాధీనం చేసుకుంటాం.. ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** ఇరాన్తో సోమవారం నాటికి ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని, ఒప్పందం కుదుర్చుకోకపోతే అన్నింటిని పేల్చేసి, చమురును స్వాధీనం చేసుకునే ఆలోచనలో ఉన్నానని ట్రంప్ అన్నారు. ఆయన ఆదివారం ఫాక్స్ న్యూస్ మాట్లాడుతూ, ఈ చర్చల్లో ఇరాన్ ప్రతినిధులకు పరిమిత క్షమాభిక్ష మంజూరు చేసినట్లు తెలిపారు. చర్చలు విఫలమైతే ఇరాన్ చమురు వనరులను స్వాధీనం చేసుకోవడంతో సహా తీవ్రమైన చర్యలు తీసుకోవచ్చని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్లో కుర్దిష్ మార్గాల ద్వారా నిరసనకారులకు అమెరికా ఆయుధాలను పంపిందని, అయితే అని వారికి చేరి ఉండకపోవచ్చని సంచనలు వ్యాఖ్యలు చేశారు. కుర్దిష్ సమూహాలు ఆ ఆయుధాలను తమ వద్దే ఉంచుకోని ఉండవచ్చని అన్నారు. హోరుజ్ బలసంధిని తెరవకపోతే ఈ మంగళవారం కరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై దాడులు చేస్తామని బెదిరించిన గంటల వ్యవధిలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# దీదీ పాలన మహా జంగిల్ రాజ్

## ఎన్నికల తర్వాత బెంగాల్ నుండి భయం పారిపోతుంది.

## తృణమూల్ కాంగ్రెస్ పతనం ఖాయమైంది.

## ఈ నెలలోనే మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం

## కూచిబిహార్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ



కూచ్ బిహార్: మే 4 తరువాత పశ్చిమ బెంగాల్ నుండి భయం పారిపోతుందని, బీజేపీ నాయకత్వంలో విశ్వాసం మేల్కొంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయమైందని అన్నారు. జరిగి గత నెలలో ఎన్నికలు ప్రకటించిన తరువాత ఆయన మొదటి సారిగా ఆదివారం పశ్చిమ బెంగాల్లోని కూచి బహార్లో న ఎన్నికల సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ సభకు హాజరైన ప్రజలను చూస్తుంటే తృణ మూల్ కాంగ్రెస్ పతనం ఖాయమైందని స్పష్టమవు తోందని అన్నారు. పోలింగ్ రోజున టీఎంసీ గూండాలు ఎంత గా బెదిరించినా సరే చట్టంపై నమ్మకం ఉంచాలి. ఈ ఎన్నికల ద్వారా బెంగాల్ నుండి భయం పూర్తిగా పారద్రోలబడు తుంది. బీజేపీ సాధించే ఘన విజయంతో ప్రజల్లో ఆత్మవిశ్వాసం మేల్కొంటుంది. నేను మీకు హామీ ఇస్తున్నాను. ఈ ఎన్నికల తరువాత వారి పాపాలకు పూర్తి లెక్కలు తేలుస్తాం. ఒక్కొక్క టిగా అన్నింటికి పరిష్కారం లభిస్తుంది. మే 4 తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఆ గూండా ఎంత పెద్దవాడై నా సరే, ఈసారి మాత్రం న్యాయం కచ్చితంగా జరుగుతుంది. అనిపునరుద్ఘాటించారు. ఒకవైపుటీఎంసీ పట్ల భయం ఉంటే, మరోవైపు బీజేపీపై నమ్మకం ఉంది. ఒక వైపు టీఎంసీ కట్మనీ (కమిషన్లదందా), అవినీతి పట్ల భయం ఉంటే, మరో వైపు అభివృద్ధిని వేగవంతం చేయగల బీజేపీపై నమ్మకం ఉంది. ఒక "వైపు అక్రమచొరబాట్లపట్లభయం ఉంటే, మరో వైపు రాష్ట్రం నుండి ఆ చొరబాటుదారులను తరిమికొట్టగల బీజేపీపై నమ్మకం ఉంది అని మోడీ వ్యాఖ్యానించారు.

### టీఎంసీ పాలనలో శాంతిభద్రతలకు అంత్యక్రియలు

ఈ సందర్భంగా మాల్దా ఘటన గురించి ప్రత్యేకంగా ప్రసా బివించారు. ఈ ఘటనను అధికార పార్టీ సాగిస్తున్న మహాజంగి ల్ రాజ్కు నిదర్శనంగా అభివర్ణించారు. బెంగాల్లో శాంతిభద్రతలకు అంత్యక్రియలు జరిపించడానికి రాష్ట్ర అధికార పార్టీ కంకణం కట్టుకుందని ఆరోపించారు. న్యాయాధికారులకే రక్షణ లేనప్పుడు టీఎంసీ పాలనలో సామాన్య ప్రజలు ఎలా సురక్షితంగా ఉంటారని ప్రశ్నించారు. టీఎంసీ ప్రభుత్వం ఏ ఒక్క రాజ్యాంగ సంస్థకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. టీఎంసీ నిరంకుశ పాలనలో బెంగాల్ అనే ఈ పవిత్ర గడ్డపై ప్రజాస్వామ్యం ప్రతిరోజూ రక్తమోడుతోందని అన్నారు.

### రాబోయే లోక్సభ ఎన్నికల నుండి మహిళా రిజర్వేషన్లు

2029 లోక్సభ ఎన్నికల నుండి మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికల గురించి కూడా ప్రధానమంత్రి ఈ సభలో ప్రస్తావించారు. ఈ చట్టానికి సంబంధించిన అవసరమైన బిల్లులను ఆమోదించడానికి ఏప్రిల్ 16 నుండి 18 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన సోదరీమణులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించింది. 3 కోట్ల మంది సోదరీమణులను లక్షపతి దీదీలుగా తీర్చిదిద్దాం. అయితే దేశం కోసం తీసుకునే నిర్ణయాలలో మహిళల పాత్ర మరింతగా పెరగడం అవసరమని అన్నారు. అందుకే లోక్సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని తమ ప్రభుత్వం రూపొందించిం దని అన్నారు. 2029 లోక్సభ ఎన్నికల నుండే పశ్చిమ బెంగాల్తో సహా దేశ వ్యాప్తంగా ఉన్న సోదరీమణులందరూ ఈ రిజర్వేషన ప్రయోజనాలు పొందేలా చేయడానికి ప్రస్తుతం కృషి జరుగుతోందని అని మోదీ అన్నారు. జనాభా నియంత్ర ణలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రా లుతమసీట్లసంఖ్య తగిపోతుందని భయపడవలసిన అవసరం లేదని మోడీ భరోసా ఇచ్చారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ లబ్ధిపొందుతారు. అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం. ప్రతి ఒక్కరి హక్కులు సురక్షితంగా ఉంటాయని అన్నారు. మహిళల కోసం అదనప సీట్లను పెంచడం ద్వారా రాష్ట్రాలుపెద్ద ఎత్తున ప్రయోజనం పొందేలా చూడాలనుకుంటున్నట్లు తెలిపారు.

# చెన్నైకి హ్యాట్రిక్ పరాభవం





బెంగళూరు : ఐపీఎల్-19లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జోరు కొనసాగుతున్నది. ఆదివారం రాత్రి చిన్నస్వామి స్టేడియంలో భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో బెంగళూరు.. మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను 43 పరుగుల తేడాతో ఓడించి సీజన్‌లో రెండో విజయాన్ని నమోదుచేయగా సీఎస్‌కేకు ఇది హ్యాట్రిక్ ఓటమి కావడం గమనార్హం. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ.. టిమ్ డేవిడ్ (25 బంతుల్లో 70 నాటౌట్, 3 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఊచకోతకు తోడు దేవ్‌దత్ పడిక్కల్ (29 బంతుల్లో 50, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రజత్ పటీదార్ (19 బంతుల్లో 48 నాటౌట్, 1 ఫోర్, 6 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (30 బంతుల్లో 46, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) వీరవిహారంతో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 250 పరుగుల రికార్డు స్కోరు చేసింది. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సీఎస్‌కే.. 19.4 ఓవర్లకు 207 రన్స్ వద్దే ఆగిపోయింది.

టాపార్డర్ విఫలమైనా సర్ఫరాజ్ (50), ప్రశాంత్ (43), ఓవర్టన్ (37) పోరాటంతో ఆ జట్టుకు అవమానకర ఓటమి నుంచి తప్పించారు. భువనేశ్వర్ (3/41), కృనాల్ (2/36), డఫ్ఫీ (2/58) చెన్నైని కట్టడిచేశారు. భారీ ఛేదనలో సంజూ (9) మరోసారి నిరాశపరచగా గత మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రె (1), కెప్టెన్ రుతురాజ్ (7) దారుణంగా విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన భువీ.. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి సీమర్‌గా రికార్డులకెక్కాడు.



## టీ20 క్రికెట్లో రోహిత్ శర్మ రికార్డు తిరగరాసిన కోహ్లీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఒకే ప్రత్యర్థిపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 28 పరుగులు చేయడం ద్వారా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ తిరగరాశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 1,161 పరుగులతో రోహిత్ శర్మ ఈ రికార్డును కలిగి ఉన్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో చెన్నైపై కోహ్లీ మొత్తం పరుగుల సంఖ్య 1,188కి చేరింది. దీంతో టీ20 ఫార్మాట్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ అగ్రస్థానంలో నిలిచాడు. ఆసక్తికరంగా, ఈ జాబితాలో పంజాబ్ కింగ్స్‌పై 1,159 పరుగులతో కోహ్లీ మూడో స్థానంలో కూడా ఉండటం విశేషం. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇది ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యధిక స్కోరు. దేవదత్ పడిక్కల్ (50), ఫిలిప్ సాల్ట్ (46) శుభారంభం అందించగా, కెప్టెన్ రజత్ పటిదార్ (48), టిమ్ డేవిడ్ (70) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఈ ఇద్దరూ కేవలం 36 బంతుల్లోనే 99 పరుగులు జోడించారు.

# చివరి వరకు పోరాడిన సన్‌రైజర్స్



## ఉత్కంఠ పోరులో లక్నో విజయం

సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వీరోచితంగా పోరాడినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (68 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో లక్నోను గెలిపించాడు. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు మంచి ఆరంభం లభించింది. ఎయిడెన్ మార్‌క్రమ్ (45) వేగంగా ఆడాడు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్యలో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. కానీ, ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రిషభ్ పంత్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆఖరి ఓవర్ లో లక్నో విజయానికి 9 పరుగులు కావాల్సి ఉండగా... పంత్ రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు సమం అయింది. 4 బంతుల్లో 1 పరుగు కావాల్సి ఉండగా... ఉనద్కట్ రెండు డాట్ బాల్స్ విసరడంతో ఉత్కంఠ పెరిగిపోయింది. మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీస్తే బాగుండని సన్ రైజర్స్ అభిమానులు కోరుకున్నారు. అయితే, పంత్ మరో బౌండరీ కొట్టడంతో మ్యాచ్ సన్ రైజర్స్ చేజారింది. లక్నో 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దూబె 2 వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకుంది. మహమ్మద్ షమీ (2/9) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ట్రావిస్ హెడ్ (7), అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో, పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో కలిసిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్ కోలుకుంది. క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది.

# భారత టెస్టు జట్టు ప్రక్షాళనకు బీసీసీఐ మాస్టర్ ప్లాన్..

## లక్ష్మణ్ నేతృత్వంలో 64 మందితో టాలెంట్ హంట్



2024, 2025 సంవత్సరాల్లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లలో భారత జట్టు ఐదు మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై దృష్టి సారించి, జట్టును బలోపేతం చేసేందుకు ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. వీవీఎస్ లక్ష్మణ్ నేతృత్వంలోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఈ మేరకు ఒక పటిష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే దశాబ్దానికి అవసరమైన నాణ్యమైన రెడ్ బాల్ క్రికెటర్లను తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

ఇందులో భాగంగా జూన్-జులై మాసాల్లో 25 ఏళ్లలోపు వయసున్న 64 మంది యువ ప్రతిభావంతులతో ఒక ఇంట్రా-సీఓఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి 'జెన్-జీ' తరం ఆటగాళ్లు పాల్గొంటారు. ఎంపిక చేసిన 64 మందిని 16 మంది చొప్పున నాలుగు జట్లుగా విభజించి, ఒక్కో జట్టుతో రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడిస్తారు. ఆటగాళ్ల నైపుణ్యాలను పరీక్షించేందుకు బెంగళూరులోని సీఓఈలో విభిన్న పిచ్‌లను సిద్ధం చేయనున్నారు. ఈ 64 మంది ఆటగాళ్లను మూడు మార్గాల ద్వారా ఎంపిక చేస్తారు. కూచ్ బెహార్ ట్రోఫీ (అండర్-19), సీకే నాయుడు ట్రోఫీ (అండర్-23)లలో రాణించిన 25 మందిని ఎస్. శరత్ నేతృత్వంలోని జూనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలలో సత్తా చాటి, ఐపీఎల్‌లో భాగం కాని మరో 25 మందిని సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. వీరితో పాటు ఐపీఎల్‌లో ఆడుతున్న సమీర్ రిజ్వీ వంటి 14 మంది యువ ఆటగాళ్లను కూడా ఈ జాబితాలో చేర్చనున్నారు. సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లతో సమన్వయం చేసుకుంటూ ఈ రోడ్‌మ్యాప్‌ను అమలు చేయనున్నట్లు బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి. రాబోయే ఏడాది పాటు బెంగళూరులో జరిగే హై-పెర్ఫార్మెన్స్ క్యాంపులలో రెడ్ బాల్ క్రికెట్‌కే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని స్థాయిల సెలక్టర్లకు, కోచ్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ టోర్నీలో రాణించిన వారి నుంచే ఇండియా-ఏ, ఇండియా ఎమర్జింగ్ (అండర్-25) జట్లను ఎంపిక చేస్తారు. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఈ జట్లు శ్రీలంక పర్యటనకు వెళ్లి నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడతాయి.

# కరీంనగర్‌లో ఘనంగా మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం



కరీంనగర్, ఏప్రిల్ 05: కరీంనగర్‌లో మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. నగరంలోని తీగలగుట్టపల్లిలో నిర్మించిన నూతన క్యాంపు కార్యాలయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి గజమాల వేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మరియు పార్టీ శ్రేణులతో కలిసి కేంద్ర మంత్రి కార్యాలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత బండి సంజయ్ కుమార్ మేయర్‌ను కుర్చీలో ఆసీనులను చేసి శాలువాతో సత్కరించగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయ ప్రాంగణం జనసందోహంతో పండగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, క్యాంపు కార్యాలయం ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా పనిచేస్తుందని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో నూతన పాలకవర్గం కృషి చేస్తుందని అన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని, విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించడంలో ముందుండాలని పాలకవర్గం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి: కందగట్ల స్వామి, గుండు సుధారాణి




కరీంనగర్, ఏప్రిల్ 05: పద్మశాలీలు రాజకీయంగా వెనుకబడిన వర్గమని, వారికి ప్రభుత్వాలు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించి చైతన్యవంతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి అన్నారు. కరీంనగర్‌లో పద్మశాలి జిల్లా సంఘం, పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలి కళ్యాణమండపంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీలు సమాజంలో సంఖ్యాబలం ఉన్నప్పటికీ రాజకీయంగా తగిన గుర్తింపు లేకపోవడంతో చట్టసభల్లో ప్రాధాన్యత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వర్గాల ఆధిపత్యం కారణంగా పద్మశాలీలు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగుతూ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, ప్రత్యేక సదస్సులు నిర్వహించుకోవాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు అమలైతే పద్మశాలీలకు రాజకీయంగా మరింత అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజనతో అవకాశాలు పెరిగే అవకాశం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఆసక్తి ఉన్నవారు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని, పాలనలో పద్మశాలీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో గెలుపొందిన మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పద్మశాలి జిల్లా సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం అధ్యక్షత వహించగా, స్వర్గం మల్లేశం, మాచర్ల రామచంద్రరావు, బోల్ల శివశంకర్, డాక్టర్ పోరండ్ల కిషన్, డాక్టర్ చాట్ల శ్రీధర్, గుంటుక రూప, గొరిట్యాల సమత, వాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత బాబూ జగ్జీవన్ రామ్: బండి సంజయ్ కుమార్



కరీంనగర్, ఏప్రిల్ 05: భారత రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు, దళిత జాతి రత్నం బాబూ జగ్జీవన్ రామ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా కొనసాగిన ఆయన దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించి చూపారని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. "చిన్నప్పటి నుంచి కుల వివక్షను ఎదుర్కొని పోరాడిన నాయకుడు జగ్జీవన్ రామ్. అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత. కష్టాలను జయించి ఎదగాలి, బలహీన వర్గాల కోసం నిలబడాలి, దేశ సేవే పరమ ధర్మం అనే మూడు సిద్ధాంతాలను ఆచరించి చూపిన నాయకుడు" అని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో 1952 నుంచి 1986 వరకు నిరంతరం పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన జగ్జీవన్ రామ్ కేంద్రంలో దీర్ఘకాలం మంత్రిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీతో కలిసి నడిచిన జగ్జీవన్ రామ్ భారత రాజకీయ, సామాజిక రంగాల్లో అజాతశత్రువుగా నిలిచారని తెలిపారు. ఆయన చూపిన ఆదర్శాలు, సంస్కరణల మార్గాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

## జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కరీంనగర్, ఏప్రిల్ 05: దేశానికి వివిధ కీలక పదవుల్లో 30 ఏళ్లకు పైగా సేవలందించిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మహనీయుల మాదిరిగా ఉన్నత ఆలోచనలతో గొప్ప లక్ష్యాల కోసం కృషి చేయాలని సూచించారు. ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని కరువు నుంచి కాపాడిన నాయకుడిగా జగ్జీవన్ రామ్ సేవలను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ ఆయన కుటుంబ సభ్యుల పాత్ర ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములు వంటి పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ, ఎస్సీ-ఎస్టీ సబ్ ప్లాన్ చట్టబద్ధతతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమైందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎస్సీ




సంక్షేమ శాఖ, సబ్ ప్లాన్ ద్వారా అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ న్యాయ, రక్షణ, వ్యవసాయ శాఖల్లో కీలక పాత్ర పోషించిన జగ్జీవన్ రామ్ సమానత్వానికి కట్టుబడి పనిచేసిన మహనీయుడని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బలహీన వర్గాలకు అండగా నిలవాలని పిలుపునివ్వగా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మహనీయుల ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని హక్కులు, విధులు తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టడీ సర్కిల్ విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకోగా, కులాంతర వివాహాలు చేసుకున్న పలువురికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంకాలం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు మరియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి నీ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ మరియు బిజెపి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. గుట్ట పైకి చేరుకొని ప్రత్యేక మొక్కలు చెల్లించుకున్న అనంతరం, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, కమిటీ సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో దేవాలయం మరియు పరిసర ప్రాంతాల అభివృద్ధి, పూజారుల వసతి భవనం, భక్తుల వసతి సత్ర నిర్మాణానికి సహకారం, దేవాలయం చుట్టుపక్కల 15 మీటర్ల స్థలం పెరిగే విధంగా , పిల్లర్లు వేసి స్లాబ్ నిర్మాణం చేయాలని తద్వారా స్వామివారి కల్యాణ సమయంలో అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని విన్నవించారు. అలాగే రాజగోపుర నిర్మాణం, గుట్ట పైకి వృద్ధులు వెళ్ళుటకు ప్రత్యామ్నాయ రహదారి, శాశ్వత తాగునీటి సౌకర్యం, స్త్రీ పురుషులకు విడివిడిగా మరుగుదొడ్ల నిర్మాణం మొదలగు ఆలయ అభివృద్ధి విషయాలను ప్రస్తవిస్తూ మెమోరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న,కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కొలిపాక రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, నాయకులు సొల్లు అజయ్ వర్మ , గైని రాజు, కొత్తపేట రామచంద్రం, దొడ్ల ప్రశాంత్, తూముల రమేష్ యాదవ్, ఒగ్గు కనకయ్య, పులి శ్రీకాంత్ గౌడ్, బెజ్జంకి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.





# ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంగా హుస్నాబాద్‌లో హిందూ సమ్మేళనం

**హిందూ ఐక్యత, సంస్కృతి పరిరక్షణపై వక్తల పిలుపు**

**కుల భేదాలు మరిచి సమాజం ఐక్యంగా ఉండాలని స్వామీజీ సందేశం**

**యువత భారతీయ సంప్రదాయాలను కాపాడాలని ప్రముఖుల సూచన**

**వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తి వాతావరణం**

హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం ఆదివారం హిందూ చైతన్యంతో ఉప్పొంగింది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్ఎస్ఎస్) స్థాపించి వంద వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా హిందూ చైతన్య కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సంకటహర చతుర్థి వినాయక యజ్ఞాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమ్మేళనానికి ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఆర్ఎస్ఎస్ గ్రామ ప్రాంత వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి ప్రసంగిస్తూ, సంఘం ఎన్నడూ రాజకీయాలకు తావు లేకుండా కేవలం హిందువుల



సమగ్ర అభివృద్ధి, దేశ సేవ, ప్రజా హితం కోసమే నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. హిందుత్వం అనేది కేవలం ఒక మతానికి పరిమితం కాదని, అది ఒక ఉన్నతమైన జీవన విధానమని ఆయన అభివర్ణించారు.సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న పిఠాపురం శక్తి పీఠాధిపతి పూజ్య స్వామి శ్రీశ్రీశ్రీ పొక్కులూరి శ్రీరామకృష్ణ అనుగ్రహ భాషణం చేస్తూ, కుల భేదాలను విడనాడి హిందూ సమాజమంతా ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సామాజిక ఐక్యత, సహనం, పరస్పర గౌరవం పెంపొందించుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.సభాధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షులు చందుపట్ల నాగరాజు, మహిళా వక్త అడపా వీరా రాఘవ కుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య తదితరులు ప్రసంగిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో యువత ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు, యువకులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

# గాగిరెడ్డిపల్లెలో ఘనంగా 'చిరుతల రామాయణం' నాటక ప్రదర్శన





**రామాయణంలోని నీతి, ధర్మ విలువలను చాటిన కళాకారులు**

**శబరి ప్రవేశం నుంచి సీత అగ్ని ప్రవేశం వరకు ఆకట్టుకున్న సన్నివేశాలు**

**భక్తి భావంతో సాగిన జానపద నాటక ప్రదర్శన**

**వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు**

చిగురుమామిడి,జనత న్యూస్:రామాయణంలోని నీతి, ధర్మం, భక్తి, త్యాగం వంటి విలువలను ప్రజలకు తెలియజేసే అద్భుతమైన జానపద కళారూపం 'చిరుతల రామాయణం' నాటకమని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ రామాంజనేయ భజన బృందం



ఆధ్వర్యంలో ఆదివారం చిరుతల రామాయణం నాటక ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... జానపద కళల ద్వారా ఆధ్యాత్మిక భావం పెంపొందించడంలో చిరుతల రామాయణం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కళాకారులు తమ పాత్రల ద్వారా రామాయణంలోని విలువలను సమాజానికి అందించడం అభినందనీయమని తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ నాటక ప్రదర్శనలో శబరి ప్రవేశం, ఆంజనేయుడి లంక ప్రవేశం, వాలివధ, రావణబ్రహ్మ వధ, సీత అగ్ని ప్రవేశం వంటి సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈనెల 6న సోమవారం ఉదయం 10 గంటలకు సీతారాముల వారి పట్టాభిషేక మహోత్సవం, ఓడి బియ్యం పోయుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, కళాకారులు హాజరై నాటక ప్రదర్శనను తిలకించారు. నాటకంలో కల్వల రాజేశ్వర్ రెడ్డి (దశరథుడు), కల్వల చంద్రారెడ్డి (రాముడు), మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేష్ (లక్ష్మణుడు), కల్వల మనీష్ రెడ్డి (భరతుడు), మాజీ ఉపసర్పంచ్ అన్నాడి మల్లికార్జున్ రెడ్డి (రావణబ్రహ్మ) తమ పాత్రల్లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సున్నీళ్ల కవిత, ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల కొమురెల్లి, మాజీ జెడ్పీటిసి అందే స్వామి, పంతులు కల్వల చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకిలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ప్రజాసంఘాల సమన్వయంతో ఉత్సవ కమిటీ అధ్యక్షులు శానగొండ శరత్ కుమార్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు మరియు ప్రజా సంఘాల నాయకులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ అట్టడుగు బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని, కుల, మత రహిత సమాజం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఉప సర్పంచ్ ధూమాల మహేష్ , బ్లాక్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ లింగాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకటి రాములు, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, సోషల్ మీడియా ఇంచార్జి ఏల శేఖర్ బాబు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్, ఎస్ టి యు జిల్లా ఆర్థిక కార్యదర్శి రామంచ రవీందర్, పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆల్ ఇండియన్ అంబేద్కర్ సంఘ మండల అధ్యక్షులు దీటి బాల నర్సు, ఉపాధ్యక్షులు మాశం బాబు, ప్రధాన కార్యదర్శి బోనగిరి శేషు కుమార్, పట్టణ అధ్యక్షులు కొత్త రాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పరుశరాములు, ప్రధాన కార్యదర్శి మోదుంపెల్లి రాజు, పట్టణ అధ్యక్షులు బోనగిరి చంద్రయ్య, స్వేరో సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు ఉప్పులేటి బాబు, దళిత సంఘాల జిల్లా నాయకులు కొంపెల్లి రాజు, చిలుముల దేవదాస్, గాలి పల్లి మల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మహంకాళి నాగేష్, మహంకాళి భూపేందర్, బోనగిరి నవీన్ , రామంచ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# తోటపల్లిలో చలివేంద్రం ప్రారంభం




హుస్నాబాద్,జనత న్యూస్: మండలంలోని తోటపల్లి గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు తల్లిదండ్రులు బంక ఉప్పవ్వ, రాజయ్యల జ్ఞాపకార్థంగా ఈ జలదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మీ చందు సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బంక లక్ష్మీ మాట్లాడుతూ గ్రామస్తులు, బాటసారుల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు జ్యోతి, నిర్మల, శ్రీమతి, కవితతో పాటు సభ్యులు ఎల్లవ్వ, మేడలమ్మ, స్వరూప, రేఖ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సుందరగిరిలో ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



చిగురుమామిడి,జనత న్యూస్: మండలంలోని సుందరగిరి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం భారత మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్తగా, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు డా. బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, వార్డు సభ్యులు వంతడుపుల దిలిప్ కుమార్, పెసరి రాజాకృష్ణ, మంథని ప్రియాంక మహేందర్, పంచాయతీ కార్యదర్శి గోల్లోని సంపత్ కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేయడం ఏం సంస్కృతి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని బీఆర్ఎస్ సీనియర్ నేత, రామహనుమాన్ నగర్ మాజీ సర్పంచ్ యాదగిరి వెంకటేశ్వర రావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రేవంత్ రెడ్డి ఫోటో క్యాంప్ కార్యాలయంలో లేదని సాకుతో రాళ్లు విసిరి దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలకు సేవ చేసి మన్ననలుపొంది ప్రజల గుండెల్లో నిలవాలి తప్ప, దాడి చేసి గోడలపై ఫోటో పెట్టించుకుంటే ఏం ప్రయోజనం లేదని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు చిల్లర వేషాలు మానుకొని ప్రజలకు సేవ చేయాలని హితువు పలికారు.

# హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నేతల రాస్తారోకో



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను దౌర్జన్యంగా ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప మిగతా ఐదు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటివరకు కొత్తగా ఒక్క ఆసరా పెన్షన్ కూడా మంజూరు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్, కౌన్సిలర్ గాదెపాక రవీందర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పూదరి రవీందర్ గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, యాస శ్రీనివాస్, బూర వెంకన్న, బీలు నాయక్, అరవింద్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, బోజ్జ హరీష్, కూతాటి విజయభాస్కర్, కన్నోజు రామకృష్ణ, క్రాంతి, దీకొండ ప్రవీణ్, కందుకూరి సతీష్, సంపత్, గుడిశెట్టి సుధాకర్, బత్తుల జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్నల హర్షం.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.




సిరిసిల్ల. ఏప్రిల్ 5. జనత న్యూస్. సెస్ లో సిరిసిల్ల మరమగ్గాల నిర్వాహకుల విషయంలో సత్వరం స్పందించిన ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డికి వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్ మరమగ్గాల అనుబంధం సంఘాల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్ తో పాటు నాయకులు మాట్లాడుతూ సెస్ పరిధిలో ఉన్న మరమగ్గాల నిర్వాహకులకు సంబంధించి అనేక రోజులుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను ,అనుమానాలను ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి తొలగించారని అన్నారు. సిరిసిల్లలోని మరమగ్గాల పరిశ్రమ అనుబంధ పరిశ్రమల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల మరమగ్గాల యూనిట్లకు సంబంధించి 25 హెచ్పి ల వరకు 50 శాతం సబ్సిడీతో మూడవ కేటగిరీ నుంచి నాలుగవ కేటగిరికి మార్చనున్నట్లు తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. వీటితోపాటు బ్యాక్ బిల్లింగ్ విషయంలో సానుకూలంగా అధికారులు స్పందించడం కృతజ్ఞతలు తెలిపారు. ఎన్పీడీసీఎల్ అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల సుమారు 600 పైగా మరమగ్గాల యూనిట్లు పెరిగి అవకాశం ఉందని సుమారు 5000 మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. అనేక విషయాలలో ఎన్పీడీసీఎల్ అధికారులు సానుకూలంగా స్పందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సహకరించిన చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇంచార్జ్ కే.కే మహేందర్ రెడ్డి, డి.సి.సి .అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బూట్ల నవీన్, యెల్దండీ దేవదాస్, సాప గణేష్, రాపెల్లి ప్రసాద్, బండారి అశోక్, పినగాని రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నా ఊపిరి నాయకులు ఒగ్గు కనకయ్య



జనత న్యూస్ బెజ్జంకి : బిజెపి రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు,పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6 ను పురస్కరించుకొని , రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ రావు , మరియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి , కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు ప్రతి బిజెపి కార్యకర్త తన ఇంటిపై కాషాయ జెండా ఎగరవేయాలని పిలుపుతో ఆదివారం మండలంలోని కల్లెపెల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు, మరియు గ్రామపంచాయతీ 8వ వార్డు సభ్యులు ఒగ్గు కనకయ్య తన ఇంటి పైన బిజెపి కాషాయ జెండాలు ఎగరవేసి పార్టీ ఆదేశాలను పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రతి పౌరుడు భద్రతాభావంతో తమ పనులు తాము చేసుకుంటున్నారు అంటే అది బిజెపి పార్టీ నరేంద్ర మోడీ అధికారంలో ఉండడమే కారణమని తెలిపారు. నా ఊపిరి ఉన్నంతవరకు బిజెపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సులభం సౌకర్యవంతంగా పారదర్శకంగా సేవలు

## రాజన్న సిరిసిల్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి



సిరిసిల్ల. ఏప్రిల్ 5. జనత న్యూస్. సెస్ విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువై, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే సంకల్పంతో, విద్యుత్ సేవలను మరింత సులభతరం, పారదర్శకంగా అందించాలనే మహత్తర నిర్ణయాన్ని ప్రకటిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి ఆదివారం తెలిపారు. గతంలో వినియోగదారులు పలు విద్యుత్ సంబంధిత సేవలకు విద్యుత్ కార్యాలయాలకు నేరుగా వెళ్ళవలసిన అవసరం ఉండేది. దీని వల్ల సమయం, శ్రమ, ఆర్థిక వ్యయం అధికంగా అయ్యేవి. ఈ ఇబ్బందులను తొలగించి, ప్రతి వినియోగదారుడికి అతని ఇంటికి సమీపంలోనే అన్ని సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సేవలు ఇప్పుడు మీ సేవ కేంద్రాల్లో --- ప్రజలకు సులువైన పద్ధతి లో

కొత్త విద్యుత్ కనెక్షన్ మంజూరు, వినియోగదారుల పేరు మార్పు, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటి సేవలను ఇప్పటి నుంచి ఏ మీ- సేవ కేంద్రంలో అయినా సునాయాసంగా పొందవచ్చని సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల వినియోగదారులు దూరంగా ఉన్న విద్యుత్ కార్యాలయాలకు వెళ్ళే అవసరం లేకుండా, తమ సమీప మీ సేవ కేంద్రంలోనే సమస్త విద్యుత్ పనులను సులభంగా, వేగంగా పూర్తి చేసుకోగలరని ఆయన తెలిపారు. మీ సేవ కేంద్రాలలో అందుబాటులో ఉన్న ముఖ్య సేవలు కొత్త విద్యుత్ కనెక్షన్ మంజూరు. గృహ, వ్యాపార మరియు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఇప్పుడు ప్రతి మీ సేవ కేంద్రంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. దరఖాస్తు స్వీకరణ నుండి మంజూరు వరకు మొత్తం ప్రక్రియ సులభతరంగా, పారదర్శకంగా నిర్వహించబడుతుంది అన్నారు. రైతులకు వ్యవసాయ పంప్‌సెట్ కనెక్షన్లు, చిన్న వ్యాపారులకు వాణిజ్య కనెక్షన్లు, గృహస్తులకు గృహ కనెక్షన్లు --- అన్నీ ఒకే చోట, ఒకే దరఖాస్తు ద్వారా పొందే సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. మీ సేవ కేంద్రానికి వెళ్ళి, అవసరమైన పత్రాలు సమర్పించి, సత్వరం సేవ పొందవచ్చు. క్లిష్టమైన అనుభవాన్ని సరళమైన ప్రక్రియగా మార్చడమే ఈ సేవ యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు మీ సేవ కేంద్రాల్లో నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చు. డిజిటల్ చెల్లింపు పద్ధతులతో పాటు నగదు చెల్లింపు సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. బిల్లు చెల్లించిన వెంటనే రసీదు అందించబడుతుందని అన్నారు. లోడ్ మార్పు (రాశ్మీుఎ జుఅష్ట్రుఅషెవఎవత్ / =వఎబష్ఱఅశీఅ), తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ (ఎవఎజూశీతీుతీఎ జశీఅ-అవష్ఱఅశీఅ), విద్యుత్ బిల్లు సవరణ దరఖాస్తులు వంటి అన్ని సేవలు కూడా మీ సేవ కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. వినియోగదారుల సౌకర్యమే మా ప్రథమ లక్ష్యం అని, అన్ని సేవలూ పారదర్శకంగా, నిర్ణీత సమయపరిమితిలో నిర్వహించ బడతాయని అన్నారు. అవినీతికి, అనవసర జాప్యానికి తావు ఉండదని ఆయన స్పష్టంగా హామీ ఇచ్చారు."ప్రతి వినియోగదారుడూ గౌరవంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సేవలు పొందాలని మేము కృషి చేస్తున్నట్టు తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయి" అని ఎస్. ఈ బిక్షపతి అన్నారు.

# దేశహితం, జాతీయ భద్రతే లక్ష్యం

## బీజేపీ ఏకైక పార్టీ: బొంతల కళ్యాణ్ చంద్ర



కరీంనగర్, ఏప్రిల్ 05: జాతీయ భద్రత, దేశహితం, భరతమాత సేవ కోసం దేశంలో పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన బీజేపీ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఏప్రిల్ 6న జరగనున్న 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం అలుగునూర్ (శ్రీ వెంకటేశ్వర కాలనీ)లోని తన స్వగృహంలో పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తల పార్టీగా ఎదిగిందన్నారు. పార్టీ సిద్ధాంతాలే ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. "నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్" అనే నినాదం బీజేపీని తిరుగులేని శక్తిగా నిలబెట్టిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన పార్టీ ప్రస్థానం నేడు దేశాన్ని పాలించే స్థాయికి చేరుకుని, వరుసగా మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి రావడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రత, దేశ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. "మేక్ ఇన్ ఇండియా", "ఆత్మనిర్భర్ భారత్" వంటి కార్యక్రమాల ద్వారా దేశాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్తోందని తెలిపారు. ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతున్న సమయంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ విశ్వగురువు దిశగా దూసుకుపోతుందన్నారు. దేశ సమస్యలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కారాల కోసం మోదీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని చెప్పారు. దేశానికి, రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వాలే శ్రీరామరక్ష అని ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర వ్యాఖ్యానించారు.

# బేడ బుడగ జంగం వేదిక ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మానం



కరీంనగర్, ఏప్రిల్ 05: కరీంనగర్‌లో బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం సమాజానికి చెందిన కార్పొరేటర్‌గా విజయం సాధించిన భూపతి రవీందర్‌ను వేదికపై ఘనంగా సత్కరించారు. ఆయన విజయం సమాజానికి గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సమాజం రాజకీయంగా మరింత ముందుకు రావడానికి ఇలాంటి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై అభినందనలు తెలిపారు. బేడ బుడగ జంగం సమాజం సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆల్ ఇండియా బేడ బుడగ జంగం కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఆర్. వెంకటేశం మాట్లాడుతూ సమాజ ఐక్యతను పెంపొందించుకుని రాజకీయ చైతన్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కడమంచి సహదేవుడు (బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి), సిరిపాటి వేణు (బేడ బుడగ జంగం జన సంఘం), మోటం రామ్ కుమార్, కార్యక్రమ నిర్వాహకుడు కళ్యాణం శరత్ చంద్ర, మేధావుల ఫోరం నాయకులు డాక్టర్ కళ్ళెం ఆంజనేయులు, రిటైర్డ్ టీచర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతీయ, రాష్ట్ర, స్థానిక నాయకులు, యువజన నాయకులు మరియు సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జీవో 317 బాధితుల మౌన శాంతి ర్యాలీ




హుస్నాబాద్,జనత న్యూస్: జీవో 317తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆదివారం హుస్నాబాద్‌లో మౌన శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఆరు పేజీల వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ జీవో 317 అమలులో స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా సీనియార్టీ ఆధారంగా బదిలీలు జరిపారని, దీంతో అనేక మంది ఉద్యోగులు ఇతర జిల్లాల్లో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం 48 గంటల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా రెండున్నర సంవత్సరాలు గడిచినా పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు జీవో 190 ప్రకారం తాత్కాలిక డిప్యూటేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ ఉత్తర్వులు జారీ కాలేదని పేర్కొన్నారు. శాసనసభలో సమస్య పరిష్కారమైందని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని అన్నారు. నాలుగున్నర ఏళ్లుగా ఇతర జిల్లాల్లో పోస్టింగులు రావడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని, ఉదయం వేళల్లోనే విధులకు వెళ్లి రాత్రి ఇంటికి చేరాల్సి వస్తోందని తెలిపారు. జీవో 190 ప్రకారం దరఖాస్తు చేసిన వారికి వెంటనే తాత్కాలిక డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేయాలని, స్పౌజ్ కేసులకు ప్రాధాన్యంగా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com